ప్రజాశక్తి

సోమవారం 26 డిసెంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

టీచర్ల బదీలపై ఉత్కంఠ!

- నేడు హైకోర్టులో విచారణ
- సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



డిఇఒ కార్యాలయంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఇటీవల అర్జీలు అందచేస్తున్న ఉపాధ్యాయులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వ నిబంధనలను వ్యతిరేకిస్తూ కొంత మంది ఉపాధ్యాయులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించగా దీనిపై సోమవారం విచారణ జరుగుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన రేషన్‌లైజేషన్ మార్గదర్శల ప్రకారం ఎనిమిదేళ్ళ పూర్తి కాకుండానే కొంతమంది బదిలీ కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఉపాధ్యాయులు తెలిపారు. గతంలో పనిచేసిన పాయింట్‌లతో పాటు ప్రత్యేక పాయింట్లు తమకు కేటాయించాలని వారు కోరుతున్నారు. ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసేంత వరకే ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు హైకోర్టు సూచించింది. తరువాత కోర్టు ఇచ్చే ఉత్తర్వులకు అనుగుణంగా ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లాలని కోర్టు ఆదేశించింది. దీంతో బదిలీలపై సందిగ్ధత ఏర్పడింది.

మరోవైపు జిల్లా విద్యాశాఖ అధికారులు రూపొందించిన సీనియారిటీ జాబితాల ప్రకారం అధికారులు చూపిన ఖాళీలకు ఆప్షన్స్ ఇచ్చేందుకు ఇప్పటికే దరఖాస్తు చేసిన వారిలో కొంత మంది ప్రయత్నిస్తున్నారు. అధికారులు చూపిన ఖాళీల ప్రకారం సంబంధిత స్థానం కోసం ఎక్కువ మంది ఆప్షన్స్ ఇచ్చే అవకాశం లేకపోలేదు. మరోవైపు సీనియారిటీ జాబితాలో కొన్ని లోపాలున్నాయని కూడా ఉపాధ్యాయులు వాపోతున్నారు. వీటిపై ఇప్పటికే తమ అభ్యంతరాలను వెబ్‌సైట్‌లో దాఖలు చేస్తున్నట్టు తెలిసింది. దరఖాస్తులో కనిపించిన పాయింట్లు సీనియార్టీ జాబితాలో లేవని కొంత మంది ఉపాధ్యాయులు తెలిపారు.

జిల్లాలో మొత్తం 5,683 మంది దరఖాస్తు చేశారు. ఎస్‌జిటిలో 3,024 మంది, ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్స్ కలిపి 2,659 మంది ఉన్నారు. ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సీనియారిటీ జాబితాలను ప్రకటించామని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ తెలిపారు. అభ్యంతరాలుంటే సంబంధిత అధికారి ధ్రువీకరణతో ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చని తెలియజేశారు.

ప్రధానంగా బదిలీల ప్రక్రియకు సంబంధించి రూపొందించిన స్టాఫ్టవేర్ గందరగోళంగా మారింది. ఉపాధ్యాయులు ఒకేరోజు ప్రమోషన్ పొంది ఒకేరోజు విధుల్లో చేరినా వేర్వేరు ప్రాంతాల్లో పని చేస్తుండగా వారికి సంబంధిత స్టేషన్ కేటాయింపుల్లో తప్పులు దొర్లాయి. సర్వీసు పాయింట్స్‌కు సంబంధించి ఉద్యోగంలో చేరిన నాటికి ఆరు నెలలు ముందు, ఆరు నెలల తరువాత కాలాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదని తెలిసింది. ఆరు నెలల నిబంధన వల్ల ఎక్కువగా పాయింట్స్ తగ్గుతున్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు. బదిలీల్లో కీలకంగా ఉన్న ఫ్రాక్షన్ పాయింట్స్‌పై గందరగోళం నెలకొంది. ప్రధానోపాధ్యాయులకు రూపొందించిన రోస్టర్ పాయింట్ల అంశంపైనా వారిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. బదిలీలకు సంబంధించి ఇచ్చిన ఉత్తర్వులు లోపభూయిష్టంగా ఉన్నాయని, నిబంధనలు తమ దరఖాస్తులకు అవరోధంగా ఉన్నాయని తెలిపారు.

పింఛన్లు, కార్డులు రద్దు చేస్తే ఉద్యమం

- సంక్షేమమంటూనే మరోవైపు పొట్టగొట్టడం సరికాదు
- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు



విలేకర్లతో మాట్లాడుతున్న పాశం రామారావు

పేదలకు నిబంధనల పేరుతో సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు అక్రమంగా రద్దు చేస్తే ఉద్యమాలు చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. నిబంధనల పేరుతో జిల్లాలో 8-10 వేల సామాజిక పింఛన్లు రద్దు చేసేందుకు లబ్ధిదారులకు నోటీసులు జారీచేశారని, ప్రతి సచివాలయ పరిధిలో కనీసం 20 పింఛన్ల రద్దుకు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఒకవైపు పింఛను రూ.2500 నుండి రూ.2750కు పెంచుతున్నట్లు ప్రకటించి, మరోవైపు వివిధ కారణాలతో కుదించటం ఏమి సంక్షేమమని ప్రశ్నించారు. 300 యూనిట్లకుపైన విద్యుత్, వెయ్యి చదరపు అడుగుల స్థలంలో ఇంటి నిర్మాణం, నాలుగు చక్రాల వాహనం (బాడుగకు త్రిప్పుకోవడానికి కొన్నా) పింఛన్లు రద్దు చేస్థున్నట్లు ప్రకటించడం అన్యాయమన్నారు. ఇప్పటికే జిల్లాలో తాడేపల్లి పట్టణంలో 292 మందికి, తాడేపల్లి రూరల్ మండలంలో కుంచనపల్లిలో 58 మంది, ఇప్పటం, మెల్లంపూడి గ్రామాలలో 146, వడ్డేశ్వరంలో 57, కొలనుకొండలో 31, తుళ్లూరు మండలం వెలగపూడిలో 15, తెనాలి మండలం తేలపాడులో 21, పెదనందిపాడులో 15, పెదకాకాని 5వ సచివాలయ పరిధిలో 19, మంగళగిరి పట్టణంలో సుమారు 500, పాత గుంటూరు 12, 13 సచివాలయాల పరిధిలో 83 మందికి నోటీలసులు ఇచ్చారని చెప్పారు. నవరత్నాలను అమలు చేస్తున్నామంటూ పేదల కోసమే మా ప్రభుత్వం అని ఆర్భాటంగా ప్రకటిస్తూ పేదల పొట్టలు కొట్టడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ప్రతి సచివాలయాల పరిధిలో 100 నుండి 140 రేషన్ కార్డుల రద్దుకు రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. పట్టణ సచివాలయాల పరిధిలో 15 శాతం, గ్రామ సచివాలయాల పరిధిలో 10 శాతం తగ్గకుండా కార్డులు రద్దు చేయబోతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా పెట్రోలు, డీజిల్ వంట గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని, ఈ స్థితిలో పింఛన్లు, కార్డులు రద్దు చేయటం పేదలపై మరింత భారం మోపడమేనని మండిపడ్డారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పాల్గొన్నారు.

ఆశపెట్టి రూ.లక్షల బేరం..

- ఆశ కార్యాకర్తల పోస్టు నియామకంలో అక్రమాలు
- రెండు గ్రూపుల మధ్య వివాదం - ఆందోళనలో అభ్యర్థులు

ప్రజాశక్తి- మేడికొండూరు

నిబంధనలకు విరుద్ధంగా ఆశా కార్యకర్త పోస్టులను భర్తీ చేయడం ద్వారా సామాన్యుల నుండి డబ్బు దండుకోవాలనే యత్నాల్లో కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు నిమగ్నమయ్యారు. అయితే తమ వారికే వీటిని ఇప్పించుకోవాలని మరో గ్రూపు నాయకులూ ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అర్హులకు పోస్టులు దక్కడం ప్రశ్నార్థమైంది. మరోవైపు రాజకీయంగానూ వివాదాలు చెలరేగుతున్నాయి.

మండల కేంద్రమైన మేడికొండూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ▶ 2లో



బందోబస్తు విధుల్లో పోలీసులు

29వ తేదీ వరకూ 144 సెక్షన్

ప్రజాశక్తి - మాచర్ల

అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి శ్రేణుల మధ్య ఈనెల 16న మాచర్ల పట్టణంలో ఘర్షణల నేపథ్యంలో 17వ తేదీ నుండి 21వ తేది వరకు పట్టణంలో 144 సెక్షన్ విధించారు. దానిని తొలివిడతగా 21వ తేదీ నుండి 26వ తేదీ వరకు పొడిగించగా తాజాగా 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు పొడిగిస్తూ తహాశీల్దార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పట్టణ సిఐ బాలకృష్ణ ఆదివారం తెలిపారు.

డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది..

- రూ.2 లక్షల కోసం చోరీ నాటకం
- రైతులను మోసం చేసే యత్నం
- దర్యాప్తులో దొరికిపోయిన పత్తివ్యాపారి

3లో



నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ గౌరవాధ్యక్షులు తోట సాంబశివరావు

కాపు రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

ఆత్మకూరులో ఆదివారం కాపు రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు తాటి కృష్ణారావు నాయుడు అధ్యక్షత వహించారు. సమావేశంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ను అసోసియేషన్ గౌరవాధ్యక్షులు తోట సాంబశివరావు ఆవిష్కరించారు. సమావేశాన్ని ఉద్దేశించి తాటి కష్ణారావు నాయుడు మాట్లాడారు. కాపు రిటైర్డ్ ఎంప్లాయిస్ సంక్షేమం కోసం అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వై.గోవిందరావు, హరినాథ్ బాబు, గుడిపాటి చిన్న తిరుపతి నాయుడు, యు . బాలకృష్ణ, కె.నాంచారయ్య, ఎమ్మెస్ కె.శ్రీధర్ పాల్గొన్నారు. తొలుత సమావేశంలో ఇటీవల మరణించిన ప్రముఖ సినీ నటులు దివంగత కైకాల సత్యనారాయణకు, స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.



సంఘం క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న బృందం

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన విరాట్ విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మారీసుపేట బాలా త్రిపుర సుందరి కల్యాణ మండపంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షులు పిఎస్సార్ బ్రహ్మ చార్యులు అధ్యక్షత వహించిన సభలో తొలుత సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న కాకతీయ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డిఎల్ కాంతారావు చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్య క్రమంలో పెద్దిపాటి నాగేశ్వరరావు, మూర్తి శ్రీమన్నారాయణ, గోలి వెంకటేశ్వరరావు, గ్రంధి చంద్రమౌళేశ్వరరావు, చెన్నుపల్లి దుర్గాప్రసాదరావు, ఎ.పోతురాజు, సిద్దు వెంకటరమణ, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రీ మెచ్యూరిటీ సమస్యలకు ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స

ప్రముఖ రెటీనా కన్సల్టెంట్ డాక్టర్ డేవిడ్ అగర్వాల్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ శిశువులకు ప్రభావితం చేసే కళ్లకు సంబంధించిన అంధత్వ వ్యాధికి నగరంలోని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నందు చికిత్స అందించనున్నట్లు ప్రముఖ రెటీనా కన్సల్టెంట్ డాక్టర్ డేవిడ్ అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా కొంత మంది శిశువులు పుట్టిన సమయంలో ఆరోగ్యంగానే ఉంటారని, పుట్టిన తరువాత రెండు మూడు వారాలలో కళ్లకు సంబంధించిన సమస్య వస్తుందన్నారు. దీనికి సంబంధించి కంటి వైద్యులు నిర్ధారణ చేసిన తరువాత చికిత్సను అందించనున్నట్లు తెలిపారు

మనువాద పాలకుల కుట్రలను తిప్పికొట్టండి

మనుస్మృతి దహనంలో బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు అట్లూరి బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - నరసరావుపేట

నిమ్న జాతులు వేదాలు చదువరాదని, చదివితే నాలుకలు తెగ్గొయ్యాలని వింటే చెవుల్లో సీసం కరిగించి పొయ్యాలని మనుస్మృతి శాసించిందని బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు అట్లూరి బాల సుబ్రహ్మణ్యం అన్నారు.అంబేద్కర్ స్ఫూర్తితో కుల నిర్మూలనా పోరాట సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో ని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం మనుస్మృతి దహన కార్యక్రమం నిర్వహించారు. నిమ్న జాతులు పైకొచ్చే అవకాశం లేకుండా అణగదొక్క బడేందుకు కారణమైన మనుస్మృతిని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 1927డిసెంబర్ 25న వేలాది ప్రజల మధ్య బహిరంగంగా తగులబెట్టారని సుబ్రహ్మణ్యం గుర్తుచేశారు. ఈ సందర్భంగా కెఎన్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ సమాజంలో పీడిత ప్రజల మధ్య కుల అసమానతలు పెంచి పోషిస్తూ వారి మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, వారి రెక్కల కష్టాన్ని అప్పనంగా దోచుకుతినేందుకు ఆధునిక మనువాద పాలకులు భారత రాజ్యాంగం స్థానంలో మను(అ)ధర్మ శాస్త్రాన్ని ప్రవేశ పెట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఆధునిక మనువాద పాలకుల కుట్రలను తిప్పి కొడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి దళిత పీడిత కులాల ప్రజలు, మైనారిటీలు సంఘటితగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, కెఎన్‌పిఎస్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు గొల్లపూడి చిన్న ప్రసాద్, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, బయ్యవరపు రామయ్య, సతీష్, నాగిపోగు శ్రీను, కంబాల ఏడుకొండలు (ప్రగతిశీల కార్మిక సమాఖ్య)జి.రామకృష్ణ (దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం) స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మనుధర్మశాస్త్ర ప్రతి దగ్ధం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కులవ్యవస్థకు, స్త్రీ బానిసత్వానికి, అంటరాని తనానికి మూలకారణమైన మనుధర్మశాస్త్ర ప్రతిని ఆదివారం కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ ఆధ్వర్యంలో ఐతానగర్ హయ్యంపేట గ్రంథాలయం వద్ద దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఆలిండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి సెక్రటరి అందె శ్యామ్, దాసరి సన్ని, జ్యోతుల రాజీవ్‌కుమార్, దాసు పాల్గొన్నారు.



నరసరావుపేటలో..



తెనాలిలో..

ఆశాజనకంగా షుగర్ వ్యాధి పరిశోధనలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: షుగర్ వ్యాధిపై జరుగుతున్న పరిశోధనల వల్ల ఆశాజనకమైన ఫలితాలు వస్తున్నాయని ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ యలమంచి ఐశ్వర్య తెలిపారు. యలమంచి డయాబెటిస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డయాబేటీస్ ఎండో కాన్ఫరెన్స్ 2022 నిర్వహించారు. బందరు రోడ్ లోని ఓ హోటల్లో జరిగిన ఈ సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది షుగర్ వ్యాధి నిపుణులు, ఎండోక్రైనాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యలమంచి సదాశివరావు, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ యలమంచి ఐశ్వర్య మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా ఈ సదస్సు నిర్వహిస్తూ షుగర్ వ్యాధికి సంబంధించిన ఉత్తమ పరిశోధనలు చేసిన వారికి గోల్డ్ మెడల్ బహూకరిస్తున్నామని తెలిపారు. షుగర్ వ్యాధిపై జరుగుతున్న పరిశోధనలు ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా కృత్రిమ ప్రాంక్రియాస్ రూపొందించే విషయంలో విజయం సాధించామని వివరించారు. షుగర్ వ్యాధిని ముందుగానే గుర్తించడం ద్వారా అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు. కాగా ఈ సదస్సులో బెంగుళూరుకు చెందిన డాక్టర్ ప్రసన్నకుమార్ కు ఫౌండేషన్ తరపున గోల్డ్ మెడల్ ను అందజేశారు. సదస్సులో డాక్టర్ కష్ణ శేషాద్రి, డాక్టర్ ఎన్‌కె సింగ్, డాక్టర్ షణ్ముగవేలు, డాక్టర్ జైదేవ్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ గీత, డాక్టర్ మైథిలి, డాక్టర్



శ్రీమన్నారాయణ, డాక్టర్ రవి, డాక్టర్ వరుణ్, డాక్టర్ రామ్ కుమార్, డాక్టర్ పీవీ రావు, డాక్టర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు .

'ఆశ'పెట్టి రూ.లక్షల బేరం..

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలో ఉన్న పేరేచర్ల-1, పేరేచర్ల-2 సచివాలయాలకు ఆశా కార్యకర్త పోస్టులు మంజూరయ్యాయి. ఒక్కో సచివాలయానికి ఒక్కో పోస్టు చొప్పున అభ్యర్థుల నుండి ఈనెల 21న నోటిఫికేషన్ జారీ చేశారు. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున మొత్తంగా ఆరుగురు ఇప్పటి వరకు దరఖాస్తు చేశారని అధికారిక సమాచారం. అయితే పేరేచర్ల-2 సచివాలయం కింద ఆశా వర్కర్ పోస్టు భర్తీలో వివాదం తలెత్తింది. దరఖాస్తు చేసుకున్న వారిలో మెరిట్ అభ్యర్థికి కాకుండా తమకు నచ్చిన వారికి పోస్టును ఇవ్వడానికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకుగాను రూ.రెండు మూడు లక్షల వరకూ బేరం కదుర్చుకున్నారనే విమర్శలూ ఉన్నాయి.

పేరేచర్లలో వైసిపికి చెందిన వారు రెండు గ్రూపులుగా విడిపోయి ఉండగా టిడిపి మద్దతుదారు సర్పంచ్‌గా ఉన్నారు. ఈ క్రమంలో వైసిపిలోని ఒక గ్రూపు స్థానిక ప్రజాప్రతినిధితో కలిసి ఆశా వర్కర్ పోస్టు భర్తీలో కలుగజేసుకుంటున్నట్లు వైసిపిలోని మరో గ్రూపు ఆరోపిస్తోంది. పైగా ఈ పోస్టును స్థానిక ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుపై ఓడిపోయిన వారికి ఇవ్వజూస్తున్నారని, దీనిపై తాము వైసిపి తాడికొండ నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మయ్య దృష్టికీ తీసుకెళ్లామని వైసిపి నాయకులు, ఎంపిపి భర్త అయిన మన్నవ రాజేష్ చెబుతున్నారు. మరోవైపు దరఖాస్తుదారులు సైతం ఈ అంశంలో ఆందోళనగా ఉన్నారు. పోస్టులను అమ్ముకోవడం కాకుండా అర్హత ప్రాతిపదికన భర్తీ చేయాలని, ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేకంగా పరిశీలించాలని కోరుతున్నారు

నూజెండ్లలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - నూజెండ్ల

విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, ఇంటి పన్ను, పెట్రోల్ డీజిల్ ధరలు అధిక రేట్లు, నిత్యవసరాల ధరలు పెంపు, చెత్త పన్ను, ఆస్తి పన్ను అంటూ అన్ని పనులు వసూళ్లు చేస్తూ జగన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఏ వర్గాన్ని వదల కుండా దోపిడీ చేస్తున్నారని, ఒక్కసారి అవకాశం అంటే నమ్మి ఓటేసినందుకు రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అని మండల టిడిపి అధ్యక్షులు మీసాల మురళి యాదవ్ క్లస్టర్ ఇన్‌ఛార్జి బచ్చు అంజిరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి లగడపాటి సూరీ విమర్శించారు. మండల కేంద్రమైన నూజెండ్లలో శనివారం రాత్రి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలు పడుతున్న అవస్థలను వివరించారు. నిత్యవసరాల ధరలు ఆకాశంలో ఉండి రాష్ట్రంలో పేదలు అర్ధాలతో బ్రతికే పరిస్థితి నెలకొంది అన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం పరిహారం చెల్లించక,



అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న రైతులకు కౌలు రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించక రైతులు నట్టేట ముంచిన అసమర్ధ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, భయం గుప్పెట్లో ఆడబిడ్డలు, నిరుద్యోగ యువత, డ్రగ్స్ గంజాయి మత్తులో యువత చిత్తవుతున్నారని అన్నారు.

కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గంగినేని ఆంజనేయులు, తెలుగు యువత నాయకులు లగడపాటి శ్రీనివాసరావు, ప్రసాద్ ,గంగినేని బ్రహ్మయ్య, సుబ్బారావు, గంగినేని బ్రహ్మానాయుడు, రామినేని సుబ్బారావు, నెల్లూరు వెంకటరావు, బీరెల్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది..

- రూ.2 లక్షల కోసం చోరీ నాటకం
- రైతులను మోసం చేసే యత్నం
- దర్యాప్తులో దొరికిపోయిన పత్తివ్యాపారి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రైతుల వద్ద నుండి పత్తి పంటను కొని వారికి డబ్బులు చెల్లించకుండా ఆ సొమ్మును కాజేయాలని దురుద్దేశంతో దారి దోపిడీ డ్రామా చిత్రీకరించి కటకటాల పాలైన నిందితుడ్ని ఉదంతం వెల్లడైంది. దీనిపై వివరాలను పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో సిఐ బి.సురేష్‌బాబు ఆదివారం వెల్లడించారు. తాడికొండ మండలం కంతేరుకు చెందిన గంధం శ్రీను పదేళ్లుగా కంతేరు, కొప్పురావూరు చుట్టుపక్కల గ్రామాల్లో పత్తి కొంటున్నాడు. రైతులకు సకాలంలో సొమ్ము చెల్లిస్తూ నమ్మకంగా ఉంటున్నాడు. అతనికి కొన్ని దురలవాట్లతోపాటు కంతేరులో ఒక మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో ఈనెల 17న కంతేరుకు చెందిన కొండా మృత్యుంజయుడు, కొప్పురావూరుకు చెందిన ఆలా శ్రీనివాసరావు, అలా కృష్ణ వద్ద పత్తి కొనుగోలు చేశాడు. ఈ పత్తిని గుంటూరులో ఒక మిల్లులో విక్రయించాడు. మిల్లు వారు ఈనెల 19న రూ.2 లక్షలు ఇవ్వగా వీటిని తీసుకుని బైక్‌పై కంతేరు బయలుదేరాడు. రాత్రి 8 గంటల సమయంలో దారి మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లినట్టు నమ్మించి డబ్బు కాజేయాలని పథకం వేశాడు. నిందితుడు శ్రీనుతో సహజీవనం చేస్తున్న తోకల మల్లేశ్వరి కుమారుడు విశ్వేశ్వరరావుకు డబ్బులు ఇచ్చేందుకు ఫోన్ చేసి విజయవాడ రోడ్డులోని లలిత ఆస్పత్రి వద్దకు రమ్మన్నాడు. అతను రాత్రి 7.40 గంటలకు రాగా రూ. 2 లక్షలిచ్చాడు. అనంతరం దొంగలు తనను కొట్టినట్టు నమ్మించేందుకు డబ్బులు తెచ్చిన సంచిని కూడా కుప్ప పక్కన పడేశారు. తన సెల్‌ఫోన్‌ను కూడా పగులగొట్టాడు. తరువాత గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేసి డబ్బులు లాక్కెళ్లినట్టు నమ్మించాడు. తనపై దాడి జరిగినట్టు, గుంటూరు తులసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు కొన్ని పత్రికల్లో (ప్రజాశక్తి కాదు) వార్తలు వేయించాడు. తద్వారా రైతులను నమ్మించి వారికి ఇవ్వాల్సిన సొమ్మును దొంగలు కాజేసినట్టు నమ్మించాడు. పోలీసులకూ ఇదేవిధంగా ఫిర్యాదును చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా చోరీ జరిగినట్టు తగిన ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో నిందితుడు గంధం శ్రీనుపై అనుమానంతో విచారణ చేయగా అసలు విషయం తెలిసింది. నిందితుడి వివరాలను సెల్ టవర్ ఆధారంగా సేకరించి అరెస్టు చేసి రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సిఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుని వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు (ముసుగులో ఉన్న నిందితుడు)

బంగారం వ్యాపారులపై దాడి, దోపిడి

ప్రజాశక్తి - నరసరావుపేట

బంగారం వ్యాపారులు దారిదోపిడీకి గురైన ఘటన ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం దిగువమెట్ట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. దీనిపై వివరాలను నరసరావుపేటకు చెందిన ఎపి బులియన్ మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ వెల్లడించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట, విజయవాడకు చెందిన ముగ్గురు బంగారం వ్యాపారులు నంద్యాలకు వెళ్లారు. వ్యాపార కార్యకలాపాలు ముగించుకొని తిరుగు ప్రయాణంలో నల్లమల అటవీ ప్రాంతం వద్దకు రాగానే ఆదివారం తెల్లవారుజామున ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం దిగువమెట్ట వద్ద వారి కారును దుండగులు అడ్డగించారు. కారు అద్దాలు పగలగొట్టి రూ.21 లక్షలు, కిలో బంగారం తీసుకోవడంతోపాటు కారునూ తీసుకుని ఆదే కారులో పరారయ్యారు. అయితే కారును నంద్యాలలో వదిలేయడంతో కారును పోలీసులు స్వాధీనం చేసుకుని గిద్దలూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కారు సేఫ్టీ లాకర్‌లో ఉన్న 1250 గ్రాముల బంగారం, రూ.14 లక్షలు సురక్షితంగానే ఉన్నాయని విజయ్‌కుమార్ తెలిపారు. దీనిపై ఒంగోలు, పల్నాడు జిల్లాల ఎస్పీలు, గిద్దలూరు ఎమ్మెల్యేకు సమాచారం ఇచ్చామన్నారు. నిందితులను గుర్తించి సొత్తు రికవరీ చేయాలని కోరారు.



ఉత్సాహంగా కెఆర్‌యు అంతర కళాశాలల అథ్లెటిక్స్

ప్రజాశక్తి - విజయవాడ రూరల్

కృష్ణా విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ (కెఆర్‌యుఐసి) అథ్లెటిక్స్ పురుషుల, మహిళల ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను నున్నలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బిపిఇడి) కైవసం చేసుకుంది. ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కాలేజీ, ఉయ్యూరులోని ఎజి అండ్ ఎస్‌జి సిద్ధార్థ కళాశాలల జట్లు వరుసగా పురుషులు, మహిళల్లో వరుసగా రెండో స్థానంలో నిలిచాయి. వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళలకు రెండు రోజుల పాటు అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ఉయ్యూరులోని ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కాలేజీలో నిర్వహించారు. ఆ పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పురుషుల జట్టు అన్ని ఈవెంట్లలో రాణించి 64 పాయింట్లతో కృష్ణా యూనివర్శిటీ చాంఫియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. మహిళ జట్టు 68 పాయింట్లతో ఆ విభాగం టైటిల్‌ను దక్కించుకుంది. పురుషుల విభాగంలో జాకీర్ హుస్సేన్ కళాశాల 38 పాయింట్లు సాధించగా, ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ మహిళల జట్టు 46 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాయి. విజేతలు, రన్నరప్‌లకు ఎజి అండ్ ఎస్‌జి సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వికాస్ బిపిఇడి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రాజు వ్యక్తిగత పతకాలు, ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌యుఐసి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రత్నబాబు, రఘురామ్, ఫిజికల్ డైరెక్టర్లు డి.బాలకృష్ణ, రావిచెర్ల రఘురామ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కచ్చా డ్రైయిన్ల పేరుతో మెట్లు ధ్వంసం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కచ్చా కాలువ పేరుతో తమ నివాస గృహాల మెట్లను అధికారులు పగలగొట్టించారని మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మక్కెవారిపేట 7వ లైన్‌కు చెందిన పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెట్లు పగలగొట్టి తవ్విన గుంతల్లో ప్రమాదవశాత్తు పడి గాయాల పాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇంత హడావుడి చేస్తున్న అధికారులు డ్రెయినేజ్ నిర్మిస్తారా? అంటే అదీ లేదని, అసలు ఎందుకు మెట్లు పగలగొట్టినట్లని ప్రశ్నిస్తున్నారు. పైగా గుంతలు ఎందుకు తవ్వుతున్నారో అడిగితే.. మా ఇష్టం అంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారని, తమపై కక్ష కట్టి ఈ పనులు చేస్తున్నట్లుగా ఉందని వాపోతున్నారు. కనీసం ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా సరైన విధానం లేకుండా ఇలా చేయటమేమిటని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గహాల మెట్లను మాత్రమే పగలగొట్టి మరికొన్నింటిని మినహాయించారని క్రిస్మస్ పండగ సందర్భంగా గడువు ఇవ్వాలని కోరినా ఇవ్వలేదని చెబుతున్నారు. అయితే కచ్చా కాల్వ తీయించేందుకే మెట్లను పగలగొట్టించామని అసిస్టెంట్ ఇంజినీర్ కిషోర్‌రెడ్డి తెలిపారు. కొందరికి ముందస్తు సమాచారమూ ఇవ్వకుండా కొంత వరకే మెట్లు పగలగొట్టి గుంతలు తవ్వారంటూ వచ్చిన విమర్శలపై అడగ్గా స్థానిక సిబ్బందికి అవగాహన లేకపోవడం వల్ల అలా జరిగి ఉండవచ్చని, దీనిపై పరిశీలిస్తామని చెప్పారు.





డిపో ఎదుట ఆందోళనకార్లతో మాట్లాడుతున్న పోలీసులు

వంగవీటి మోహనరంగా ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలో వంగవీటి మోహనరంగా ఫ్లెక్సీ ఏర్పాటులో వివాదం చోటుచేసుకుంది. మోహనరంగ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్న సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి స్థానిక ఆర్‌టిసి డిపో ఆవరణలోనూ కొన్ని ఫ్లెక్సీలు కట్టారు. అయితే వీటిని డిపో అధికారులు ఆదివారం ఉదయం తీయించారు. ఇది తెలిసిన అభిమానులు డిపో ఎదుట ఆందోళనకు దిగి బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. ఫ్లెక్సీలను తీయించిన డిపో మేనేజర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సుమారు 20 నిముషాల ఆందోళన కొనసాగడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆరందోళనకారులను ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడ్డించడంతో ఆందోళన విరమించారు.



ధ్వంసమైన ఎన్‌టిఆర్ విగ్రహం

ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసంపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - నూజెండ్ల

మండల కేంద్రమైన నూజెండ్లలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎన్టీఆర్ పార్క్ నందు ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసంపై టిడిపి శ్రేణులు ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు మీసాల మురళియాదవ్ మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎంతగానో అభిమానించే ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ విగ్రహాల ధ్వంసం, టిడిపి నాయకులు, కార్యకర్తల మీద కక్షసాధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. ఇదే తీరు కొనసాగితే రానున్న రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ మేరకు బస్టాండ్ సెంటర్లో చేపట్టిన నిరసనలో నాయకులు లగడపాటి శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, అంజిరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు



ఆరోగ్య మిత్రలను క్లాస్-3 ఉద్యోగులుగా గుర్తించాలి

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య మిత్రుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, మిత్రులను క్లాస్-3 గుర్తించి వేతనాలు చెల్లించాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మూడు రోజుల క్రితం రాష్ట్ర ఆరోగ్య మిత్రుల సంఘం ఆధ్వర్యంలో వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్రులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజుల క్రితం విజయవాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆరోగ్య శాఖలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గత 15 సంవత్సరాలుగా ఆరోగ్య మిత్రలు పనిచేస్తున్నారని వారిలో అధికంగా దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన వారు ఉన్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ఆవిర్భావం నుండి ఆరోగ్య మిత్రలు క్రియాశీలకంగా పనిచేస్తూ రోగి వైద్యశాలకు చిన్నప్పటినుండి తిరిగి ఇంటికి చేరేవరకు, మరియు ఇంటికి చేరిన తర్వాత వారి యోగకమాలపై ఆరోగ్య మిత్రులు కషి చేస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పదోన్నతలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో అత్యధికులు ఎక్కువ దళిత గిరిజన యువతి యువకులు ఉన్నారని, అందరూ డిగ్రీ, పీజీ, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, బిఎస్సి సింగిల్ , డిగ్రీలు మరియు ఉన్నత విద్యార్హతలు కలవారేనని , వీరికి సరైన వేతనాలు లేక, కుటుంబ భారం మోయలేక మానసిక వ్యధను అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీరు రాష్ట్ర ప్రభుత్వంలోని గ్రూప్ 3 కేడర్ల ఉద్యోగులతో సమానంగా, అంతకుమించి పని చేస్తున్నారని, వీరికి 15000 వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. గతంలో 8 వ పిఆర్సి కాలంలో వీరికి గ్రూప్ 3 క్యాడర్ కన్నా అధిక వేతనాలు చెల్లించారని, కానీ ప్రస్తుతం క్లాస్ 4 క్యాడర్లతో సమానంగా వేతనాలు చెల్లించడం అన్యాయమని అన్నారు. వీరు చేస్తున్న పనులను పరిగణలోకి తీసుకుని వీరికి కనీసం గ్రూప్ 3 క్యాడర్ల కనీస బేసిక్ ను చెల్లించడం సముచితం. లేదా జీఓ 7 ప్రకారం రూ. 21,500 కు వీరి వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

1. ఆరోగ్య మిత్రులను క్లాస్ 3 ఉద్యోగులుగా పరిగణించి క్లాస్ 3 ఉద్యోగుల కనీస బేసిక్ ను వేతనంగా చెల్లించాలి. అలాగే విధి నిర్వహణలో ఉండగా ప్రమాదంలో మరణించిన వారికి రూ. 10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, సహజ మరణానికి రూ.5 లక్షలు చెల్లించాలని, ఆరోగ్యమిత్రులకు టీఏ, డీఏ లు చెల్లించాలని, ప్రమోషన్ సౌకర్యం (గ్రేడ్ 2, గ్రేడ్ 1 తదితర) కల్పించాలని, కారుణ్య నియామకాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.


31న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మున్సిపల్ కౌ న్సిల్ హాల్‌లో ఈ నెల 31 వ తేదీన కౌన్సిలర్ల ప్రత్యేక సమావేశం జరుగుతుందని చైర్మన్ షేక్ రఫాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో చిలకలూరి పేట పురపాలక సంఘంనకు సంబంధించిన 2022- 2023 సంవత్సరానికి సవరించిన ఆదాయ వ్యయ అంచ నాలు, 2023-2024 ఏడాదికి సంబంధించి ఆదాయ వ్య య అంచనాలను తయారు చేసిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదం కోసం వారి ముందుంచటం జరుగుతుం దన్నారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు అందరు తప్పని సరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

మిర్చిపై నల్లి ముప్పేట దాడి

- పెదకూరపాడులో ఎనిమిది వేల ఎకరాల్లో మిరప సాగు
- కాపుకొచ్చే సమయంలో ఎర్ర, నల్ల, తెల్లనల్లి, పూతలో పురుగు
- నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతుల ఆవేదన



పెదకూరపాడులో మిర్చి పొలం

ప్రజాశక్తి - పెదకూరపాడు


మిరప పంటపై నల్లి ముప్పేట దాడి చేస్తుంది. మండలంలో 8,000 ఎకరాల్లో మిరప సాగు చేశారు. మిరప పంట తొలుత వర్షాభావంతో దెబ్బతిన్నాయి. గత మూడేళ్ల నుంచి మిరప రైతులు దెబ్బ తింటున్నారు. ఎకరానికి లక్షన్నర పైగా పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈ ఏడాదైనా ఎలాగైనా పంట పండించి నష్టాల బాట నుండి గట్టెక్కాలని రైతులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. గత ఏడాది కూడా మిరపకు దిగుబడి ఆధారిత, వర్షా ధారిత బీమా ఇస్తామని చెప్పి చివరకు చేతులెత్తే శారు.

మిరపపై పూతలో పురుగు దాడి

రెక్కల కష్టంతో పెంచి మిరప మొక్కలు ఎదిగాయి. కాపు కొచ్చే సమయానికి ఎర్రనల్లి, నల్లనల్లి, తెల్లనల్లి, పూతలో పురుగు దాడి పెంచాయి. దీంతో రైతాంగం మార్కెట్లో వచ్చిన కొత్త మందులు పిచికారి చేయటం ప్రారంభించారు. కంపెనీ ప్రతినిధులు, షాపు యజమానులు కూడా మా మందులు పనిచేస్తాయని వేలకువేలు గుంజుతున్నారు. దీంతో పెట్టుబడి తడిసి మోపెడయ్యాయి.



తెగులు సోకిన మిర్చి పైరు



మిర్చి పూతలో వచ్చిన పురుగు

రెట్టింపైన మందుల ధరలు

పురుగు మందుల ధరలు రెట్టింపు అయ్యాయి. గత ఏడాది మందులు ఈ సంవత్సరం 50 శాతం నుంచి 200 శాతం వరకు పెరిగాయి. రకరకాల కెమికల్స్ కాంబినేషన్ పేరుతో మరింతగా ధరలు కంపెనీలు పెంచాయి. ఈ సంవత్సరం నవంబర్‌లో వెయ్యి రూపాయలు ఉన్నా మందులు ఎమ్మార్పి నుంచి బ్లాక్‌లో అమ్ముతున్నారు. మార్కెట్లో 8 రకాల నల్లి మందులు విపరీతమైన ధరలతో రైతుల నడ్డి విరుస్తున్నాయి. అవి కూడా రెండు నుంచి 5 రోజులు మాత్రమే పనిచేస్తు న్నాయి.

వైరస్ ప్రతాపం

మిరప పంటపై ఎల్లో వైరస్ ,ముజాహిక్ వైరస్, జెమిని వైరస్ తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ఇప్పటికే అక్కడక్కడ మిరపకు వ్యాప్తి చెందుతుంది. తెల్ల దోమ పచ్చ దోమ ఇతర దోమల ద్వారా మరింతగా వేగం పుంజుకుంటుంది. వీటి నివారణకు రైతులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.


రోజు మార్చి రోజు మందు

మిరప పంటను ఆశించే నల్లి, దోమలను నివారించడానికి రోజు మార్చి రోజు మందులు పిచికారి చేస్తున్నారు. అటువంటి పొలాలు మాత్రమే అంతంత మాత్రంగా ఉన్నాయి. సాధారణంగా ఐదు నుంచి ఏడు రోజులు మధ్యలో మందులు పిచికారి చేసేవారు. అలా పిచికారి చేసిన పొలాలన్నీ దెబ్బతింటున్నాయి. ఆశించిన దిగుబడులు లేకపోయినా ప్రస్తుతం ఉన్న మిర్చి ధర తగ్గిన రైతు మరోమారు నష్టాల చవిచూడాల్సి వస్తోంది.



మిరప ఆకు రసం పీలుస్తున్న ఎర్రనల్లి

వికలాంగులకూ తప్పని తిప్పలు!



ముున్సిపల్ కమీషనర్

సామాజిక పింఛన్లలో కోత - అన్యాయం చేయొద్దంటున్న పింఛనుదారులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నూతన సంవత్సర కానుకగా సామాజిక పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ షాక్ ఇవ్వనుంది. ముఖ్యంగా వికలాంగులకు కూడా పింఛన్ల తొలగింపుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులకు ఉన్న ఆస్తులు,కరెంట్ బిల్లులతో లింకుపెట్టి కొందరి పింఛన్లను తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసులు ఇచ్చారు. కరెంట్ బిల్లు ఎక్కువ వస్తోందని కొంతమంది, సొంత ఇల్లు కాని రెండున్నర సెంట్ల స్థలం ఉందంటూ మరికొంత మంది, కుటుంబ సభ్యులకు ఆస్తులున్నా యని ఇంకొంతమంది తమకు ప్రతి నెలా ఇచ్చే సామాజిక పింఛన్లలో కోత పెడుతున్నారంటూ వాపోతున్నారు. చిలకలూరిపేట పట్టణంలో మొత్తం 29 వార్డు సచి వాలయాలు ఉన్నాయి. మొత్తం పది వేల నుంచి పద్నాలుగు వేల మందికి సామాజిక పింఛన్‌దారులు ఉన్నారు. కొన్ని సచి వాలయాల్లో తొలగించిన పింఛన్ల సంఖ్య 60 నుంచి 80 వరకు ఉన్నాయి. ఇదే సమ స్య ప్రతి వార్డు సచివాలయం లోనూ ఉంది. కరెంటు మూడు వందల యూని ట్లు దాటి ఒక్క యూ నిట్ అదనంగా వచ్చిన,ఒక మీటరు కన్నాఎక్కువ మీటర్లు వున్న, పట్టణంలో వెయ్యి చదరపు అడు గుల స్థలము గాని, ఇల్లు గాని ఉన్నా, కారు వున్న, ఇన్‌కమ్‌ట్యాక్స్ బిల్ వచ్చినా పెన్ష న్‌పై ఆశ వదలుకోవాల్సిందేనని వాపోతున్నారు. నోటీసు ఇచ్చిన పదిహేను రోజులలోపే సవరణ చేయమని అధికారులు చెప్పారంటున్నారు. సదరు నోటీసుతో డిసెంబర్ నెల పింఛన్ రాదని కొందరు విచారం వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేసిన తర్వాత కనుక వారికి పిం ఛన్ మళ్లీ వచ్చే అవకాశం ఉంటే ఫిబ్రవరిలో జనవరి పింఛన్ మాత్ర మే వస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ డిసెంబర్ నెలది రాదని కరాకండిగా చెబుతున్నారని వికలాంగులు అంటున్నారు.

ముఖ్యమంత్రి స్పందించాలి

వివిధ కారణాలు చూపి పింఛన్ దారుల జాబితాలో కోత విధించడం తగదని చిలకలూరి పేట నియోజకవర్గ కాంగ్రె స్ పార్టీ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం.రాధాకష్ణ విమర్శించారు. సామాజిక పెన్షన్లు తీసుకునే వారిని వివిధ కారణాల చూపి అనర్హులుగా ప్రకటించి నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి సామాజిక పెన్ష న్లు తీసుకునే వారికి ఎలాంటి కారణగా తొలగింపులు చేయబోమని హామి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో పింఛన్లు కోల్పోయిన వారితో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వికలాంగులకు నిబంధనలొద్దు

సామాజిక పింఛన్లు అనేక రకాల కారణాలతో తీసి వేయడం సమంజసం సంకాదని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు పేరుబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. ఎరిగిన విద్యుత్ ఛార్జీల తోటి 3 వందల నుంచి కనీసం 5 వందల యూనిట్లకు పెంచాలని పట్టణంలో 2 వేల చదర పు అడుగుల వరకు అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అందులోనూ వికలాంగులకు ఎటువంటి నిబంధన వర్తింప చేయకుండా వాళ్లకు వెంటనే డిసెంబర్ పెన్షన్ జనవరికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉన్నట్టుండి ఆపేశారు..

ప్రభుత్వ నిబంధనలు రోజురోజుకీ కఠిన తరమౌతున్నాయని ఓ పింఛన్ దారుడు వాపోయాడు. గత ప్రభుత్వం హయాంలో వికలాంగులకు ఇచ్చే రూ. 500, ఆ తర్వాత రూ.1000, అనంతరం రూ.1500, ప్రస్తుతం రూ.3.000 పిం ఛన్ తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పుడు ఉన్నట్టుండి తనకు పింఛన్ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను, తన భార్య ప్రైవేట్ ఉద్యోగాలు చేసు కుం టూ వచ్చిన దాంట్లోనే దాచుకున్న డబ్బు లతో, కొంత డబ్బు బ్యాంకులో లోన్ తీసు కుని రెండున్నర సెంట్ల స్థలములో ఇల్లు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుత నిబం ధనల ప్రకారం తన పింఛన్ ఆపివేశారని వాపోయాడు.

ఆ సాకుతో తొలగించారు..

మరో వికలాంగ పింఛన్‌దారుడు మాట్లాడుతూ తాను డిగ్రీ చదువుకున్నానని, చిన్నపాటి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు చెప్పాడు. చిన్న జీతం వస్తుందని, ఇదేదో పెద్ద ఉద్యోగంలా భావించి తన పింఛన్ తీసివేసినట్లు చెప్పారు. ప్రతి నెలా వచ్చే మూడు వేల రూపాయలు తనకు ఉపయోగకరంగా ఉండేదన్నారు.

నిబంధనలు మినహాయించాలి

మరో పింఛన్ దారుడు మాట్లాడుతూ, తాను, తన తల్లిదండ్రులపై ఆధారపడి జీవి స్తున్నానని, వారికి సొంత ఇల్లు ఉండటంతో తన పింఛన్‌ను ఆపివేశారని చెప్పారు. కనీసం వికలాంగుల విషయంలో నిబంధనలు మినహాయిం చాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీలపై అంతర్మథనం

- పాయింట్లను పరిశీలించని అధికారులు
- జాబితాలో తప్పులకు బాధ్యులు ఎవరు?
- ఆందోళనలో సగటు ఉపాధ్యాయుడు



డిఇఒ ఆఫీసు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. కాగా దరఖాస్తులలో చోటు చేసుకున్న అసంబద్ధాలపై మండల స్థాయిలో డ్రాయింగ్ ఆఫీసర్లు పట్టించుకున్న నాడుడే లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ప్రిఫరెన్షియల్, స్పౌజ్ పాయింట్ల పరిశీలన జరగలేదని, వచ్చిన దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా స్థాయికి నెట్టేశారని, దీంతో సగటు ఉపాధ్యాయుడికి అన్యాయం జరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఎంఇఒలు పరిశీలించకపోతే ఇన్ని వేల దరఖాస్తులు పరిశీలన మాకు కూడా సాధ్యం కాదని జిల్లా స్థాయి అధికారులు చేతులెత్తేసినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. ముఖ్యంగా వివిధ కేటగిరీల కింద పొందిన పాయింట్లలో దొర్లిన తప్పిదాలతో సాధారణ ఉపాధ్యాయులు తీవ్ర అంతర్మదనం చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 5600 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసిన విషయం విదితమే. జాబితాలో బయాలజీ ఉపాధ్యాయులు ఒకరు 2021లో అడహక్ ప్రమోషన్ పొందారు. జిరో సర్వీసుపై పదోన్నతి పొందినందున సదరు ఉపాధ్యాయుడికి నిబంధనల ప్రకారం బదిలీల్లో ఎలాంటి పాయింట్లు రాకూడదు. కానీ పదోన్నతి పొందక ముందు ఉన్న పాత స్టేషన్‌తో సర్వీసు పాయింట్లు వచ్చాయి. హెచ్ఎంలు కూడా పట్టించుకోకుండా దరఖాస్తును అంతే పంపించారు. అదే విధంగా ప్రిఫరెన్సియల్, స్పౌజ్ కేటగిరీ పాయింట్లు 8 ఏళ్లలో ఉపయోగించుకుంటే ప్రస్తుతం రేషనలైజేషన్‌కు గురైనా ఆయా ఉపాధ్యాయులకు ఎలాంటి పాయింట్లు ఇవ్వకూడదు. పెదకాకాని, తాడికొండతోపాటు, దాదాపు అన్ని మండలాల్లోనూ ఈ విధంగా పాయింట్లు పొందిన వారు ఉన్నారని తెలుస్తుంది. స్పౌజ్ కేటగిరీ, ప్రిఫరెన్షియల్ కేటగిరీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సంబంధించి పాయింట్లకు సంబంధించి మండల స్థాయిలో పరిశీలనే జరగలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దరఖాస్తులను సర్వీసు రికార్డులతో పోల్చి, పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించాల్సిన డ్రాయింగ్ ఆఫీసర్లు పట్టించుకోలేదు. కొందరు ఉపాధ్యాయులు ఉద్దేశపూర్వకంగానే తమకు పాయింట్లు రావని తెలిసినా ఆయా కేటగిరీల్లో దరఖాస్తు చేసుకున్నారు. కొందరు పాయింట్లు రావని తెలిసి ముందు పాయింట్లు పొందినా, తర్వాత వారు స్వయంగా తమ పాయింట్లు ఒదులుకున్నారని సమాచారం. స్థానికంగా అభ్యంతరాలు స్వీకరించే అవకాశం లేకపోవటం, గ్రీవెన్స్‌కు తక్కువ సమయం ఇచ్చి, ఆన్‌లైన్‌లో మాత్రమే అవకాశం కల్పించటంతో చాలా మంది అభ్యంతరాలు తెలపటానికి కూడా ముందుకు రాలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో గ్రీవెన్స్ గడువు పెంచి, దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి, ఉపాధ్యాయులకు ఎవ్వరికీ అన్యాయం జరగకుండా చూడాలని సర్వత్రా కోరుతున్నారు.

జీవన విధానమే వెన్నుముక సమస్యలకు కారణం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

మన రోజువారీ పనులే మనకు తెలియకుండా వెన్నెముకను దెబ్బతీసి సమస్యలకు కారణమవుతాయని ప్రముఖ స్పైన్ సర్జన్ నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి దుంపా అన్నారు. ఆదివారం అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ శరీరంలో అత్యంత సున్నితమైన వెన్నెముక విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వెన్నెముకకు ఏ చిన్న గాయమైనా ప్రాణం విలవిల్లాడుతుందని, ఏ పనులు చేయలేని పరిస్థితి వస్తుందని, వెన్నెముక సమస్యలు వచ్చిన తర్వాత వైద్యం అవసరమవుతుందని, అందుకే మొదటి నుండి జాగ్రత్తగా వ్యవహరిస్తే వెన్నెముక సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. బరువులు ఎత్తటం, వ్యాయామాలు చేయటం వెన్నెముకపై భారాన్ని పెంచుతాయన్నారు. మొబైల్‌తో ఎక్కువసేపు గడిపేవారికి, హైహీల్స్‌పై నడిచే వారికి, నిద్రపోయే విధానం వల్ల, కార్యాలయాల్లో ఎక్కువసేపు కుర్చీలకు అతుక్కుని ఉండే వారికి వెన్నెముక సమస్యలు తప్పవన్నారు. నడిచేటప్పుడు ఇబ్బందిగా ఉండటం, మూత్ర విసర్జన సమస్యలు, కాళ్లు, భుజాలు కదిపేందుకు ఇబ్బంది పడటం తిమ్మిర్లు రావటం, స్పృహ కోల్పోవటం, తలనొప్పితోపాటు తీవ్రమైన మెడనొప్పి ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. సభకు డాక్టర్ శ్యామ్ అధ్యక్షత వహించగా, ఇంజినీరు మోహనరావు, ఘనశ్యామాచార్యులు ప్రసంగించారు. అనంతరం డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని అవగాహన సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయాలి

అభివృద్ధికి ఆమడ దూరంలో ప్రగతినగర్ - డ్రెయినేజీ అధ్వానం - పాలకులు మారినా పనులు శూన్యం

టిడిపి హయాంలో రెండేళ్లు, వైసిపి ప్రభుత్వం వచ్చి మూడున్నరేళ్లు గడిచాయి.. అయినా ప్రగతి నగర్ సమస్యలు పరిష్కారం కాలేదు. పాలకులు చేసిన వాగ్ధానాలు నీటి మూటలుగా మారాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ ఇళ్ళ రిజిస్ట్రేషన్ కు అవకాశం కల్పించాలని ప్రగతి నగర్ వాసులు కోరుతున్నారు.



అలంకారప్రాయంగా ప్రగతి నగర్ ద్వారం

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని రాయపూడిలో ప్రగతి నగర్ అభివద్ధికి నోచుకోలేదు. ఏళ్ల గడిచినా, ప్రభుత్వం మారినా అభివద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రాజధాని నిర్మాణం నేపద్యంలో 2017లో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం గత ప్రభుత్వం హయాంలో రాయపూడిలోని దళిత వాడలో 67 గహాలను తొలగించారు. 'ఇప్పుడైతే మీ ఇళ్లకు రిజిస్ట్రేషన్ లేదు. తొలగించిన ఇంటి విస్తీర్ణంకు సమంగా గ్రామంలోనే ప్రధాన రహదారికి పక్కన ఇంటి స్తలం కేటాయిస్తాం... నష్ట పరిహారం ఇస్తాం.. ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌలభ్యం కూడా కలుగచేస్తాం..దాంతో మీ ఇంటికి మీరే యజమాని అవుతారు..అన్ని హక్కులూ కల్పించబడతాయని..' ప్రజా ప్రతినిధులు, అధికారులు ఊదర గొట్టారు. ఆర్ అండ్ బి అధికారులు రూపొందించిన నష్టం అంచనాలకు అనుగుణంగా దళితులకు నష్ట పరిహారం అందజేశారు. ఇంటిని తొలగించే సమయంలో ఇంటి సామాగ్రిని తరలించేందుకు కూడా కొంత సొమ్ము ముట్టజెప్పారు. కేటాయించిన ప్రత్యామ్నాయ స్థలాల వద్ద ఇళ్లు నిర్మించుకోండి.. అభివద్ధి చేస్తామనీ చెప్పారు. దీంతో లబ్ధిదారులైన దళితులు ఇళ్లు నిర్మించుకొని తమ ప్రాంతానికి 'ప్రగతి నగర్' అని పేరు నిర్ణయించి ఆర్చి ఏర్పాటు చేసుకున్నారు. అయితే దళితులకు ఇంటి రిజిస్ట్రేషన్ నేటికీ కలగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వం గానీ, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం గానీ రిజిస్ట్రేషన్ సౌలభ్యం పై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పై దళితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక శాఖ మంత్రిగా బొత్సా సత్యనారాయణ ఉన్నప్పుడు ఆయనను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంకు వెళితే ఇపుడు కుదరదని దాట వేస్తున్నారని బాధను వెలిబుచ్చుతున్నారు.

ప్రగతి నగర్‌లో ఇళ్ళకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం లేకపోవడమే కాకుండా కనీస సౌకర్యాలు కూడా లేవని దళితులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకపోవడం, కనీస సౌకర్యాలు కూడా లేవని కొంతమంది తమకు కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకోలేదని, దీంతో ఖాళీ స్థలాల్లో పిచ్చి కంప పెరిగి, మురుగు నీరు నిలిచిపోయి దోమలు ఎక్కువవుతున్నాయని వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలు, లైట్లు ఉన్నా వెలగడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. సిసి రోడ్లు నిర్మించి సైడ్ కాల్వల నిర్మాణం చేయక పోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచి పోతోందని దళితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


రాయపూడి లోని ప్రగతి నగర్



ఘనంగా సుచరిత పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు శాసనసభ్యురాలు, మాజీ మంత్రి మేకతోటి సుచరిత జన్మదిన సందర్భంగా ప్రత్తిపాడు లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులకు మరియు కోయవారిపాలెంలో ఉన్న వద్ధాశ్రమంలోని వద్ధులకు పండ్లు, దుప్పటి భోజన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గట్టు విజయకుమార్, ఎంపీపీ దాసరి అన్నమ్మ, వైస్ ఎంపీపీ ఆఫీనా సుల్తానా , వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బాపతు వెంకటరమణ, ప్రత్తిపాడు అభివద్ధి కమిటీ మెంబర్ గంగిరెడ్డి పరమారెడ్డి, ఎస్సీ సెల్ దాసరి రామారావు, మైనార్టీ సెల్ సలాం, కట్టా సుబ్బారావు, అమత రావు, గండు నాగరాజ్, రాజశేఖర్ రెడ్డి, కత్తి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో రైతులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రైతు దీక్షా శిబిరంలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఆదివారం తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో రైతులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నేలపాడు గ్రామానికి చెందిన వైద్యులు గుజ్జర్లపూడి రాజేష్, విజయవాడకు చెందిన దుగ్గిరాల నిఖిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. కాగా ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారంతో 1104 వ రోజుకు చేరాయి. తుళ్లూరు, నెక్కల్లు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి తదితర గ్రామాల్లో రైతులు, మహిళల దీక్షలు కొనసాగుతున్నాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి జై అమరావతి అంటూ నినాదాలు చేశారు.





మహానాడులో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని మహానాడులో ఆదివారం రాత్రి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షులు వి. వెంకట్రావు, వార్డు మాజీ కౌన్సిలర్ చిన్నపోతుల సుబ్బారావు (చిన్న) మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవస్థలిన్నింటిని ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. కులాల పేరిట కార్పొరేషన్లు పెట్టి అందులో నిధులు లేకుండా చేశారని మండిపడ్డారు. వీటి వల్ల పేదలకు ఉపయోగం లేదని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుదలను ఈ ప్రభుత్వం అరికట్టలేకపోయిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ తెలుగు మహిళ ఎ.కుసుమతో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పిఆర్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు అభివృద్ధి కమిటి, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోస్థానిక పిఆర్ విజ్ఞాన కేంద్రంలో బిపి, షుగర్ పరీక్షలకు ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. రెండు వందల మంది పేషెంట్లకు రెండు నెలలకు సరిపడా బిపి, షుగర్ ట్యాబ్లెట్లను అందజేశారు. సీనియర్ డాక్టర్లు ఎల్. మోహన్‌భాస్కర్, కె.రంగారావు, జూనియర్ డాక్టర్ జి.భవ్యతేజ తగు సూచనలు చేశారు. యడ్లపాడు అభివృద్ధి కమిటి సభ్యులు కె.రామబ్రహ్మం, జి. కిరణ్ కుమార్, పి.శ్రీని వాసరావు, ఎం. వేణుగోపాల్, ఎ.వంశీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, సిహెచ్ రంగారావు, కె.రామోజీరావు, కె.గోవర్ధన్, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

ఏకాగ్రత కనబరిస్తే విజయాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



క్రీడా పోటీల్లో ఏకాగ్రత కనబరిస్తే విజయాలు వరిస్తా యని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా అన్నారు. స్థానిక చంద్రమౌళి షటిల్ ప్లేయ ర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గుమ్మడి పవన్ కుమార్ జ్ఞాపకార్థం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి నాన్ మెడలిస్ట్ షటిల్ మెన్ డబుల్స్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాన్ సైదా మాట్లాడుతూ. పవన్ కుమార్ లాంటి ప్రతిభ కలిగిన షటిల్ క్రీడా కారుడు రోడ్డు ప్రమాదంలో మరణించడం రెండు తెలుగు రాష్ట్రాల షటిల్ ప్లేయర్స్ ను కలచివేసిందని, అలాం టి గొప్ప క్రీడాకారుని పేరు మీద టోర్నమెంట్ ను నిర్వ హిస్తున్న సాతు లూరి బెంజమెన్‌ను అభినందించారు. కార్యక్రమంలో పులుగుజ్జు చంద్ర, 15వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, బాలాజీ, గొంటు శ్రీనివాసరెడ్డి, కరిముల్లా, నజీర్, మహమ్మద్, ఖాదర్ మస్తాన్,జితేంద్ర పాల్గొన్నారు.



భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - యడ్లపాడు

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూరక్ష భూహక్కు కార్యక్రమంతో భూములకు సంబంధించిన అన్ని వివాదాలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తహశీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఉన్నవలో రీసర్వే ప్రక్రియలో భాగంగా పంచాయతి కార్యాలయం ప్రాంగణంలో శనివారం రాత్రి గ్రామసభను నిర్వహించారు. రైతులు, ప్రజలు హాజరైన ఈ సమావేశంలో రీసర్వేలో కొలతలకు సంబంధించిన 9(2) నోటీసులను రైతులకు పంపిణీ చేశారు. రెవెన్యూ పరి ధిలో నిర్వహించే రీసర్వేలో రైతులు పాల్గొని తమ భూములకు హద్దులతో పాటు హక్కు పత్రాలు, ఇతర ఆధారాలు చూపించి, సర్వే బృందాలకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ సర్వేయర్ రాంబాబు, వీఆర్వో ప్రేమరాజు పాల్గొన్నారు.

డీజిల్‌ను దోచేస్తున్న ముఠాలు

- అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై సంఘటనలు
- ఆగి ఉన్న లారీ కనబడితే డీజిల్ మాయం



ప్రజాశక్తి - నకరికల్లు

మండల పరిధిలోని అద్దంకి - నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారిపై ఆగిఉన్న లారీల నుండి డీజిల్‌ను దోచేస్తున్న ముఠా లు అగడాలు మితిమీరాయి. ఇటీవల తెల్లవారు జామున అడ్డరోడ్డు - విప్పర్ల మధ్యగల దాబా ఎదురుగల ఖాళీ స్థలంలో నాగార్జున సిమెంట్ కంపెనీకి చెందిన లారీ నుండి డీజిల్ చోరీ చేస్తుండగా గమనించిన డ్రైవర్ కేకలు వేయడంతో ముఠాలోని సభ్యులు రాళ్ల దాడి చేశారు. దాడిలో లారీ అద్దం పగిలింది. సుమారు ఆరుగురు యువకులు ముఠాగా ఏర్పడి రెండు కార్లలో బయలుదేరి ఈ చోరీలకు పాల్పడుతున్నా రని తెలిసింది. ఈ నెల 13న త్రిపురాపురం బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న లారీలలో డీజిల్ దొంగతనం చేస్తుండగా అక్కడే ఉన్న హోటల్ యజ మాని గుర్తించి కేకలు వేయగా దొంగతనా నికి ఉపయోగించే పైపులులను వదిలి కార్ల లో పరారయ్యారు. ఈ నెల 17న గుం టూరుకు చెందిన లారీ చల్లగుండ్ల హోటల్ వద్ద ఆపి నిద్రపోతుండగా సుమారు 200 లీటర్ల డీజిల్ దొంగతనం చేయగా పోలీ సులకు ఫిర్యాదు చేసినట్లు డ్రైవర్ తెలిపారు. దూర ప్రయాణాలు చేసే లారీ డ్రైవర్లు కాసే పు విశ్రాంతి తీసుకుందామని లారీలను ఆపితే డీజిల్ దొంగతనాలు జరుగుతుండడంతో లారీలను ఆపడం లేదని, తమ వ్యాపారం దెబ్బతింటోందని హోటల్ యజ మానులు ఆవేదనకు గురవుతున్నారు. దీనిపై పోలీసులు దృష్టి సారించి గస్తీ ముమ్మరం చేయాలని కోరుతున్నారు. దీనిపై స్థానిక ఎస్ఐ సురేష్‌ను వివరణ కోరగా హైవేపై పటి ష్టమైన పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే పోలీసులకు తెలియ జేయాలని కోరారు.



వంకాయలపాడు జెడ్పీ హైస్కూల్‌కు అదనపు తరగతులు నిర్మాణ పనులకు రూ.90 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండలం వంకాయలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తరగతి గదుల సమస్య శాశ్వతంగా తీరనుంది. మనబడి నాడు-నేడు కార్యక్రమం ఫేజ్-2లో భాగంగా పాఠశాలకు ఎనిమిది అదనపు తరగతుల నిర్మాణానికి రూ.90 లక్షల మంజూరు కావడంపై ఉపా ధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం ఆయా పనులను ప్రారంభించారు. జెసిబితో చేపట్టిన బేస్ లెవల్ పనులను సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు పరిశీలించారు.

మెట్టగుడిపాడు సర్వేయర్ మృతి

ప్రజాశక్తి - రెంటచింతల



మండలంలోని మెట్టుగుడుపాడు గ్రామ సర్వేయర్ పి.మాణిక్యరావు (49) హఠాన్మరణం చెందారు. శనివారం విధి నిర్వహణలో భాగంగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన కుప్పకూలిపోయారరు. వెంటనే నరసరావు పేట ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి గుంటూరులోనే ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆదివారం మధ్యాహ్నం బ్రెయిన్ స్ట్రోక్ కు గురైన ఆయన మృతి చెందినట్లు తహశీల్దార్ కె.పుల్లారావు తెలిపారు మాణిక్యరావు రెండున్నర దశాబ్దాలుగా మండల ప్రజలకు సుపరిచితుడు. ఆయన భార్య సంపూర్ణమ్మ రెంటచింతల ఐదో ఎంపి టిసిగా కొనసాగుతున్నారు మాణిక్యరావు మృతిపై ఎంపిపి దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ పూజల పుష్పవతి రామయ్య, ఎంపిటిసిలు, రెవెన్యూ ఉద్యోగులు సంతాపం తెలిపారు

గణపవరంలో 'ఇదేమి ఖర్మ'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఎనిమిదవ రోజు గణపవరంలోని 1వ వార్డులో, 15వ బూత్ లో నిర్వహించారు. ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు శనివారం రాత్రి ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసు కుని, కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివ రించారు. ఈసారి తెలుగుదేశం పార్టీని దీవించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు ఎం.లక్ష్మీ నారాయణ, కె.వెంకట నరసరాజు (లల్లు మాస్టర్), పి.శేషయ్య, కె. సుధాకరరావు, కె.బాపయ్య, జె.సుబ్బారావు, షేక్ హుస్సేన్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

దేవుని ప్రణాళిక ప్రకారమే ఏసుక్రీస్తు భూమిపై జన్మించినట్లు సాగరమాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి. జోసఫ్ బాల సాగర్ అన్నారు. క్రిస్మస్ వేడు కల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో భక్తులనుద్దేశించి ఆయన దైవ సందేశమిచ్చారు. ప్రపంచానికి ఆయన శాంతి, సమాధానం, కరుణ, ప్రేమ, సహనం, వంటి విలువలను చాటి చెప్పి నట్లు తెలిపారు. అలాగే, దిలన్ ఆఫ్ అబాండెంట్ ఫెలో షిప్ చర్చిలో బ్రదర్ నత్రా పీటర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేకును కట్ చేశారు, షాలోమ్ మినిస్ట్రీ లో ఎర్నెస్ట్ పాల్, లూథరన్ చర్చిలో డేవిడ్ బాబు, గ్లోరీ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీలో డానియేల్, బేతేలు ప్రార్థనా మందిరంలో శ్యామ్ కిరణ్, ది పెన్తి కోస్టల్ మిషన్ చర్చిలో జాషువా, ది క్రిస్టియన్ ఫెలో షిప్ లో తిమోతి షాలోమ్ మందిరంలో హనన్య, బాప్టిస్ట్ చర్చిలో ప్రభుదాస్, గెత్సేమెన్ ఇవాంజికల్ ఫ్రీ చర్చిలో సామ్యూల్ బాబు, ది గ్లోరీ ఆఫ్ క్రైస్ట్ చర్చిలో కోర్నేలి, ప్రార్థనలూ నిర్వహించి భక్తులకు దైవ సందేశమిచ్చారు.

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని అన్ని ప్రార్థన మందిరాల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నరగయపాలెంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో కూడా ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రహరీని ఆయన ప్రారంభించారు.మండలంలోని కోటప్పనగర్‌లోని చర్చిలోప్రత్యేక ప్రార్థనల్లో మాజీ ఎమ్మెల్యే, వైసిపి సీనియర్ నాయకులు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

క్రిస్మస్ సందర్భంగా స్థానిక చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కౌన్సిలర్ కొండూరు లెనిన్ బాబు ఇంట్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామున ఏసుక్రీస్తు గేయాలు ఆలపిస్తూ, క్రిస్మస్ చెట్లను ఊరేగించారు. గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ తాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రొంపిచర్లలోని ఏసుమహిమ ప్రార్థన మందిరంలో, సెయింట్ పాల్ సి.యస్.ఐ చర్చిలలో, వడ్లమూడివారిపాలెంలోని ఏసు కృపా ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సంతగుడి పాడు, విప్పర్ల, ముత్తనపల్లి పలుగ్రామా లలోని చర్చిలలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.



సందేశమిస్తున్న సాగరమాత విచారణ గురువులు: జోసఫ్ బాల సాగర్. చిత్రంలో భక్తులు




ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు



రొంపిచర్లలో దుస్తులు పంపిణి..



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పి.రామకృష్ణారెడ్డి



యడ్లపాడులో కాంతులీనుతున్న చర్చి

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని అన్ని చర్చిలు విద్యుత్ కాంతులతో మెరిసిపోయాయి. శనివారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చర్చిల్లో అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

క్రిస్మస్ వేడుకల్లో ప్రజాప్రతినిధులు



గుంటూరులో

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు చర్చిలలో జరిగిన క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో ప్రజలకు చర్చిలకు తరలివచ్చారు. ఫాస్టర్లు, బిషప్‌లునిర్వహించిన ప్రార్ధనలల్లో క్రైస్తవులు పాల్గొన్నారు. పలుచర్చిలలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. శాంతి, సహనం, ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ వంటి క్రీస్తు బోధనలు సకల మానవాళికి అనుసరణీయమని శాసనమండలి సభ్యులు, లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మద్దాళి గిరి, డిప్యూటి మేయర్ సజీల, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి-నార్త్ ప్యారిస్, వెస్ట్ ప్యారిస్, కపా మినిస్ట్రీస్ తదితర చర్చిలలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనలలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ, శాంతి, సంతోషం, త్యాగం, ప్రేమ, కరుణకు తార్కాణంగా సాగిన క్రీస్తు జీవన గమనం నేటికీ అందరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. గుంటూరులోని మిర్చి యార్డు వద్ద ఆదరణకర్త ప్రార్ధనా మందిరంలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీదేవి నివాసంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నియోజకవర్గ నాయకులతో కలిసి కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్: క్రిస్మస్ పండుగ సందర్భంగా చిన్నకాకాని షైన్ అనాధ శరణాలయంలో టిడిపి రాష్ట్ర మహిళా సెక్రటరీ వింజమూరు ఆశా బాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, ఆరుద్ర భూలక్ష్మి, వింజమూరు చంద్రశేఖర్, వాకా మాధవరావు, వెలగపాటి విలియం, గోవాడ దుర్గారావు, ఎండి ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా క్రిస్టమస్ పండుగను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. చర్చిలను



దుగ్గిరాలలో

రంగురంగుల విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు . మండల కేంద్రంలోని లూథరన్ చర్చ్ సాల్వేషన్ ఆర్మీ షారోన్ ప్రార్ధన మందిరాలతో పాటు అన్ని చర్చిలను అలంకరించారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

క్రిస్మస్ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలయాల్లో భక్తులు సందడి చేశారు.



పట్టణంలోని టౌన్ చర్చి, చినరావూరు బాప్టిస్టు చర్చి, యహోవా ఈరే చర్చి, లూథరన్ చర్చి, ఐతానగర్ బెరాకా చర్చి, బాపిస్టు చర్చి, రూరల్ గ్రామం కొలకలూరు కరుణానిలయం చర్చిలో ఆరాధనల్లో పెద్ద ఎత్తున ప్రార్ధనాపరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ ఎక్కిన క్రిస్మస్ తాత

ప్రజాశక్తి-తాడేపల్లి: పట్టణంలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చర్చిలను భారీ విద్యుత్ దీపాలతో అలకరించారు. క్రిస్టియన్ పేటలో ఓచర్చి ముందు వినూత్నంగా క్రిస్మస్ తాతను ట్రాక్టర్ ఎక్కించారు. చర్చి ముందు పెట్టిన ఈ ఫొటో పలువురిని ఆకర్షిస్తోంది. క్రిస్మస్ తాత ఈ పండుగకు కానుకలు తెస్తారనేది ప్రతీతి. ధాన్యం ఇంటికొచ్చే సమయం కావడం, ధాన్యాన్ని కల్లాల్లో నూర్పిడి పనులు జరుగుతున్నాయి. సందర్భోచితంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ఎక్కిన క్రిస్మస్ తాత ఫొటో వాస్తవపరిస్థితికి దగ్గరగా ఉండటంతో చర్చనీయాంశమైంది.



మంగళగిరిలో

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి శాంతి దూత మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో శనివారం అర్ధ రాత్రి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పార్క్ రోడ్ లోని సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాల్‌లో ఈ మేరకు పాస్టర్ జాన్ మార్క్ సందేశం అందించారు. ఈ ప్రత్యేక ప్రార్ధనా సమావేశం కు మినిస్ట్రీస్ అధ్యక్షులు కే. రూఫస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా ఎన్నారై ప్రముఖులు, డాక్టర్ రవి వేమూరి, రిటైర్డ్ డీఎస్పీ ఎం.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. పట్నంలోని పాత మంగళగిరి లోదనాన్ని చర్చి, హోలీ లార్డ్ పెంతుకోస్తు చర్చి, వివిధ ప్రాంతాల్లో గల క్రైస్తవ ప్రార్ధన మందిరాల్లో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి.



చర్చి నిర్మాణానికి రూ.10 వేలు వితరణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆదేశానుసారం, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు నేతత్వంలో ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండ గ్రామంలో నిర్మాణం జరుపుకుంటున్న చర్చి నిర్మాణానికి, ప్రాతూరు గ్రామ తెలుగుదేశం అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు పదివేల రూపాయలను ఆదివారం రాత్రి ప్రాతూరు గ్రామంలోని తెలుగుదేశం కార్యాలయంలో తెలుగుదేశం కొలనుకొండ గ్రామ అధ్యక్షులు కంచర్ల రంగారావుకు అందజేశారు.

కొలనుకొండలో సిపిఎం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండలో సిపిఎం ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌ను సిపిఎం కొలనుకొండ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కాట్రగడ్డ శివరామ కృష్ణయ్య కట్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు స్వీట్లు పంచిపెట్టి, క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కుంచనపల్లి గ్రామ ఒకటవ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, కొలనుకొండ సిపిఎం శాఖ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, గుండిమెడ గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి నాగ పోగు విజయరాజు, వడ్డేశ్వరం సిపిఎం శాఖా కార్యదర్శి వడ్డేశ్వరం పున్నయ్య, నాయకులు అమ్మిశెట్టి రామారావు, గద్దె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొలనుకొండలో కేక్ కట్ చేస్తున్న జొన్నా శివశంకర్, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య తదితరులు

తెలుగులో గేమ్ ఆఫ్ లైఫ్ పుస్తకాలు విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గ్లోబల్ ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ హాస్ తెలుగులో క్లాసిక్ గేమ్స్ మోనోపోలి, గేమ్ ఆఫ్ లైఫ్‌ను తెలుగులో పుస్తకాలను విడుదల చేసినట్లు సంస్థ డైరెక్టర్ లలిత్ పి. ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో ఎండ్ టు ఎండ్ గేమ్ ప్లేతో , తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలు ఆడేటపుడు తెలుగు చదవడం, మాట్లాడటం, సాధన చేయడం కోసం ఈపుస్తకాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. తెలుగులో గేమ్స్‌ను ఇష్టపడే వారికోసం పిల్లకు వినోదం అందించడం కోసం పుస్తకాలను తీసుకువచ్చినట్లు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులు రావూరి అర్జునరావు మృతి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్



నాస్తికోద్యమ నాయకులు, గాంధేయవాది గోరా పెద్ద అల్లుడు రావూరి అర్జునరావు (104) వయోభారంతో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని వారి చిన్న కుమారుడు డాక్టర్ పవర్ నివాసంలో కన్నుమూశారు. గోరా ప్రథమ కుమార్తె రావూరి మనోరమ అర్జునరావు సతీమణి. రావూరి అర్జునరావు, రావూరి మనోరమ మహాత్మాగాంధీతో పాటు సేవాగ్రాం ఆశ్రమంలో రెండు సంవత్సరాలు పాటు ఉన్నారు. వీరి ఆదర్శ వివాహం గాంధీ ఆశ్రమం సేవాగ్రామ్‌లో జరిగింది. గాంధీ చేతులు మీదుగా జరగవలసిన వీరి వివాహం ఆయన హత్యకు గురి కావడంతో ఆనాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో నిర్వహింపబడింది. రావూరి అర్జునరావు గోరాతో స్వాతంత్ర్య సంగ్రామంలోనూ, అనేక సాంఘిక ఉద్యమాలలోనూ కలిసి పనిచేశారు. జీవితాంతం సామాజిక పరివర్తనకు, అంటరానితనం, అసమానతల నిర్మూలనకు ఎంతగానో కృషి చేశారు. స్వాతంత్ర్యం సంగ్రామంలో జైలుశిక్ష అనుభవించారు. రావూరి అర్జునరావు భౌతిక కాయాన్ని హైదారబాద్ నుండి విజయవాడ నాస్తికేంద్రానికి తీసుకురానున్నారు. సోమవారం విజయవాడలో అంత్యక్రియలు జరుగనన్నాయి. పలువురు ప్రముఖులు అర్జునరావు మృతికి సంతాపం తెలిపారు.

న్యాయమూర్తులకూ రక్షణ లేదు

ధూళిపాళ్ల నరేంద్ర

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలకే కాకుండా న్యాయమూర్తులకు కూడా రక్షణ లేకుండా పోయిందని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం పొన్నూరు టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు జిల్లా డోన్ ప్రాంతంలో న్యాయమూర్తులపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. వైసీపీ హయాంలో అరాచకాలు రాజ్యమేలుతున్నాయని చెప్పారు. దీనిపైన న్యాయమూర్తులు దృష్టి సారించాలన్నారు.



మాతృసేవా సంక్షేమ సంఘం వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం గాలిగోపురం వద్ద శ్రీపేద అనాథల మాతసేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, పేదలకు అన్నదాన కార్యక్రమానికి సహాయసహకారాలు అందించిన ప్రతినిధులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు లింగినేని శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షులు సాదరబోయిన నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి చెన్నుబోయిన వెంకట నరసయ్య, కార్యదర్శి పేరం పూర్ణచంద్రరావు, సాదరబోయిన శ్రీనివాసరావు, తిరుమలశెట్టి నాగరాజు, జలసూత్రం వెంకటేష్, జలసూత్రం రోహిత్, కర్నాటి హరికష్ణ, ముద్రబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తినిచ్చిన తెలుగు రచయితల మహాసభలు

బుద్ధప్రసాద్, జి.వి.పూర్ణచంద్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఘనంగా జరిగాయని స్ఫూర్తిని నింపాయని మహాసభల గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, ప్రదాన కార్యదర్శి జి.వి.పూర్ణచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలకు దేశ, విదేశాల నుండి 1600 మంది ప్రతినిధులు తరలివచ్చి, తెలుగుభాషా పరిరక్షణ బాధ్యత తీసుకోవాల్సిందిగా జనబాహుళ్యాన్ని ఏకగ్రీవంగా కోరారన్నారు. మనం మాట్లాడే వాడుక భాషే పెను ప్రమాదంలో ఉందని, తెలుగు వాడకంలో ఉంటేనే భాష సజీవంగా ఉంటుందని తెలిపారన్నారు. తెలుగు మహాసభలను ప్రజలకు అందించడంలో తెలుగు పత్రికలు నిర్వహించిన పాత్ర గణణీయమైనదని, ఈసందర్భంగా సంపాదకులకు కృతజ్ఞతలు తెలిపారు. యువ రచయితలు, ఉపాధ్యాయులు ఈసభల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. మహిళా ప్రతినిధులు తమ గళాన్ని ఘనంగా వినిపించారని మారుతున్న సామాజిక పరిస్థితుల్లో రచయితల పాత్ర అనే అంశంపైజరిగిన సదస్సులో వివిధ రంగాలకు చెందిన రచయితలు పెచ్చుమీరుతున్న వాణిజ్య సంస్కృతి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాద్యత గురించి చర్చించారన్నారు. మూడు వేదికలపై సమాంతరంగా 30కిపైగా సదస్సులు, కవి సమ్మేళనాలు, వివిధ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయన్నారు. జాతీయ ప్రఖ్యాతి పొందిన యువ అష్టావధానులతో అద్భుతావధానం, 15 మంది కవులతో గలల్స్ ముషాయిరా, కళారత్న కె.వి.సత్యనారాయణ బృందం నిర్వహించిన ఆముక్త మాల్యద నృత్య రూపకం, నేక్షిత అనే చిన్నారి చేసిన నృత్య ప్రదర్శన మహాసభల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. మహాసభలకు సహకరించిన అంతరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని, భవిష్య కార్యాచరణలో మరిన్ని కార్యక్రమాల నిర్వహణకు ఈమహా సభలు స్ఫూర్తిదాయకం కాగలవని నమ్ముతున్నామని తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్, తదితరులు

సాహిత్య తత్వవేత్త పాపినేని శివశంకర్

ప్రజాశక్తి-గుంటూరు

సమాజ మార్పునకు సాహిత్యం ఒక పనిముట్టుగా పని చేయాలని తన సాహిత్య రచనల ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు పొందిన డాక్టర్ పాపినేని శివశంకర్ సాహిత్య తత్వవేత్తగా రాణిస్తున్నార ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌విఆర్ విద్య కళాశాల సమావేశ మందిరంలో సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్ రచించిన కవిత సంపుటి 'లోయలు-శిఖరాలు' కథా సంపుటి సరళరేఖలు పుస్తకాలను మాణిక్య వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. మోదుగుల రవికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవి, కథకుడు ఎం.వి.రామిరెడ్డి 'లోయలు-శిఖరాలు' పుస్తకాన్ని పరిచయం చేస్తూ కవికి సమాజమే వస్తువని, పాఠకులను రంజింప చేస్తూ జాగృతం చేసేలా రచనలు చేస్తున్న విశిష్ట కవి శివశంకర్ అని కొనియాడారు. కథా సంపుటిని నూతక్కి ఉమ పరిచయం చేశారు. అనంతరం పాపినేని శివశంకర్ మాట్లాడుతూ తన గురువు తుమ్మల సీతారామమూర్తి ద్వారా ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ వ్యక్తిగా మానవీయ విలువలతో సాహిత్య సేద్యాన్ని చేసే అవకాశం దక్కటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు రావి రంగారావు, కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య, రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

డాక్టర్ వడ్లమూడికి వుళక్కి స్మారక బంగారు పతకం

ప్రజాశక్తి-తెనాలి



డాక్టర్ నాగేశ్వరరావుకు పురస్కారాన్ని అందిస్తున్న డాక్టర్ కోటినాగయ్య

డాక్టర్ మేజర్ కాకుమాను వుళక్కి మెమోరియల్ బంగారు పతక ప్రదానోత్సవం ఆదివారం స్థానిక బోస్-రోడ్డులోని ది ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) హాల్లో నిర్వహించారు. డాక్టర్ మేజర్ కాకుమాను వుళక్కి వర్ధంతిని ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ కోటినాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వడ్లమూడి నాగేశ్వరరావుకు గోల్డ్ మెడల్‌ను, సర్టిఫికెట్‌ను అందించారు. కోటినాగయ్య మాట్లాడుతూ దాదాపు 90 ఏళ్ల క్రితమే ఇంగ్లాండ్‌లో ఎంబిబిఎస్ చదివి, మాతృభూమిపై మమకారంతో పట్టణంలో వైద్యశాలను ఏర్పాటు చేసి, పేదలకు వైద్యసేవలు అందించారని, డాక్టర్ మేజర్ కాకుమాను వుళక్కి ఎంతో ఆదర్శనీయులని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ వి.పవని ప్రియాంక, డాక్టర్ విజయలక్ష్మి పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పంట కొనుగోలుపై తాలు మాటలు

రైతుల వద్ద ధాన్యం మొత్తాన్నీ మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు పైస్థాయి నుండి కింది స్థాయి వరకూ పదేపదే చెబుతున్నారు. తరచూ ప్రకటనలిస్తున్నారు. అయితే అవన్నీ ఒట్టి మాటలుగానే మిగులుతున్నాయి. కొనుగోళ్లు చేపట్టక రైతు భరోసా కేంద్రాలు వెలవెలబోతుండగా, ప్రైవేటు వ్యాపారులు మాత్రం అయినకాడికి దండుకుంటూ లారీలకు లారీల ధాన్యాన్ని తరలించేసుకుంటున్నారు. నాణ్యతా ప్రమాణాల పేరుతో ప్రభుత్వం పెడుతున్న నిబంధనలే వ్యాపారుల పంట పండిస్తున్నాయి.

- గోతాల సరఫరా, పంట రవాణాలోనూ ఇబ్బందులు
- కొనుగోళ్లు లేక వెలవెలబోతున్న రైతు భరోసా కేంద్రాలు
- వ్యాపారుల పంట పండిస్తున్న ప్రభుత్వ నిబంధనలు
- బస్తాకు రూ.150-300 వరకూ నష్టపోతున్న రైతు



దుగ్గిరాలలో ధాన్యం ఆరబోసే పనిలో కూలీలు



పెనుమూలిలో ప్రైవేటు వ్యాపారి కొన్న ధాన్యం

ప్రజాశక్తి - దుగ్గిరాల

దుగ్గిరాల మండలంలో సాగు భూమి 22 వేల ఎకరాలు కాగా ఈ మొత్తం విస్తీర్ణంలో మొదటి పంటంతా వరినే రైతులు సాగు చేశారు. ఈ ఏడాది సగటున దిగుబడి ఎకరాకు 38 బస్తాలు (బస్తా 77 కిలోలు)గా ఉంది. ఈ లెక్కన మండలం మొత్తం 8,3600 బస్తాల దిగుబడి వస్తుంది. ఇప్పటికే దాదాపు సగానికిపైగా వరికోతలు పూర్తయ్యాయి. మండలంలో 17 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ప్రభుత్వ ప్రకటన ప్రకారం వీటన్నింటిలోనూ ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి. ప్రస్తుతానికి రైతుల వద్దకు చేరిన మొత్తం పంటలో సగం అంటే 4 లక్షల బస్తాలకు పైగా ధాన్యం కొనుగోలు చేయాలి. వాస్తవంగా అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఇప్పటి వరకు 150 టన్నుల ధాన్యాన్ని (1948 బస్తాలు) మాత్రమే కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

డెల్టా ప్రాంతంలోని సాగుదార్లలో 70 శాతం మంది కౌలురైతులే. దుగ్గిరాల మండలంలో ఇది 75 శాతం వరకూ ఉండొచ్చని అంచనా. పంట కొనుగోలు విషయంలో వీరందరికీ మొండిచేయే మిగిలింది. పంట ఈ-క్రాప్‌లో నమోదైతేనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొంటామని అధికారులు చెబుతున్నారు. అయితే కౌలురైతుల గుర్తింపులోనే తీవ్రమైన వైఫల్యం కారణంగా వారంతా తమ పంటను అమ్ముకోవడానికి అనర్హులుగా మిగులుతున్నారు. ఒకవేళ భూ యజమాని పేరుతో పంట అమ్ముదామన్నా నగదు యజమాని ఖాతాలో జమ చేసే అంశం కౌల్దార్లకు పెద్ద అవాంతరంగా మారింది.

దీనికితోడు కొనుగోలు సందర్భంలో నాణ్యతా ప్రమాణాలూ రైతులను భయపెడుతున్నాయి. ధాన్యంలో తేమ, మట్టి, చెత్త, తాలు, దెబ్బతిన్నది, మొలకెత్తినవి, పరిపక్వం కానివి, ముడుచుకు పోయినవి, వంకర పోయినవి అంటూ తరుగు తీసేస్తుండడంతో కొనుగోలు కేంద్రాలంటేనే రైతులు ఆసక్తి చూపడం లేదు. వీటన్నింటికీ సిద్ధపడినా పంటను కొనుగోలు కేంద్రానికి తరలించడమూ రైతులకు భారమవుతోంది. గోతాలను సమకూర్చడం లేదు. ఒక్కో రైతు భరోసా కేంద్రం కింద 1500 ఎకరాల వరకూ పొలం ఉండగా గోతాలు మాత్రం ఒక్కో కేంద్రానికి వంద మాత్రమే ఇచ్చారు. పంట తరలింపులోనూ లారీ ధాన్యం ఉంటేనే వాహనాన్ని పంపుతామని అధికారులు చెబుతున్నట్లు రైతులంటున్నారు.

ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకే తెగనమ్ముకుంటున్నారు. దీన్ని ఆసరగా చేసుకుని వ్యాపారులు తమకు తోచినంత ధరతో సరిపెడుతున్నారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధరల ప్రకారం సాధారణ రకం ధాన్యం క్వింటాళ్ రూ.2040, 'ఎ' గ్రేడ్ అయితే రూ.2060 రైతులకు దక్కాలి. బస్తాల లెక్కలో అయితే సాధారణ రకానికి రూ.1570, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.1586 ఇవ్వాలి. ప్రైవేటు వ్యాపారులు మాత్రం సాధారణ రకమైతే రూ.1250, 'ఎ' గ్రేడ్ ధాన్యమైతే రూ.1400కు మాత్రమే కొంటున్నారు. దీంతో రైతులు బస్తాకు రూ.150-300 వరకూ నష్టపోతున్నారు.

ఇబ్బందులు పడలేకే ప్రైవేటు వ్యాపారులకు

సొంత పొలం ఎకరంతోపాటు మరో రెండెకరాలు కౌలుకు సాగు చేశాను. సాగు పెట్టుబడి కోసం అప్పులు చేశా. పొలంలో పనులప్పుడు కూలీలకు, యంత్రాలకు సాయంత్రానికి డబ్బులివ్వాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పంట అమ్మితే 21 రోజుల వరకూ డబ్బుల కోసం ఎదురు చూడాలి. ఈ లోగా అప్పుల వాళ్ల ఒత్తిడి ఉంటుంది. ఆ ఇబ్బంది ఉండదనుకుంటే ధాన్యం కొనేటప్పుడు ఈ-క్రాప్ అడుగుతున్నారు. పంటను ఆరబెట్టుకుని తేవాలని చెబుతున్నారు. వీటికీ అదనపు ఖర్చులవుతాయి. ఈ తలనొప్పులన్నీ పడలేక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది.



నాగళ్ల సత్యనారాయణ, కౌలురైతు పెనుమూలి.

కొనుగోలు వేగం పెంచాలి

ధాన్యం కొనుగోలును ప్రభుత్వం వేగవంతం చేయకపోవడంతో పంటంతా ప్రైవేటు వ్యాపారులకే తక్కువ ధరకు వెళ్లిపోతోంది. తేమ శాతంలోనూ ప్రభుత్వం నిబంధనలు సడలించాలి. కొనుగోలు కేంద్రానికి పంట అమ్మేటప్పుడు కాటా వేసిన దగ్గర్నుండి ధాన్యాన్ని మిల్లుకు చేర్చేదాక రైతులు ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఇది సాధ్యపడడం లేదు. డబ్బులు కూడా పంట కొన్న వెంటనే 25 శాతమైనా ఇస్తే దాన్ని రబి, ఇతర అవసరాలకు రైతు ఉపయోగించుకోవడానికి వీలుంటుంది. ప్రభుత్వమే రుణాలిప్పిస్తే రైతులకు ప్రైవేటు వ్యాపారులు, అప్పుల ఒత్తిడి ఉండదు.



వి.సాంబశివరావు, రైతు సంఘం నాయకులు

రూ.88 కోట్లతో రహదారుల అభివృద్ధి

ప్రాధాన్యతా క్రమంలో మరమ్మతులు, విస్తరణ - ప్రజాశక్తితో ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ నిర్మల

జిల్లాలో రహదారుల మరమ్మత్తులు, నిర్మాణం కోసం రూ.41 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు రోడ్లు, భవనాలు (ఆర్ అండ్ బి) శాఖ ఎస్ఇ ఎన్‌వి.నిర్మల తెలిపారు. ఇవి మంజూరైతే 128 కిలో మీటర్ల మేరకు రహదారుల అభివృద్ధికి ఈ నిధులు వినియోగిస్తామన్నారు. ఇప్పటికే దెబ్బతిన్న రహదారుల అభివృద్ధికి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.47 కోట్లతో పనులు చేపట్టినట్టు వివరించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.



జిల్లాలో ఎన్ని కిలో మీటర్ల రహదారులు దెబ్బతిన్నాయి?

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 987 కిలో మీటర్ల రహదార్లుండగా 313 కిలో మీటర్ల వరకు దెబ్బతిన్నట్టు గుర్తించాం. తొలి విడత 185 కిలో మీటర్ల మేరకు పనులు చేపట్టాం. రూ.47.38 కోట్ల పనులు తుదిదశకు చేరుకున్నాయి. మరో 128 కిలో మీటర్ల రహదారుల అభివృద్ధికీ ప్రతిపాదనలు ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయి. రూ.41 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వ అనుమతులు రాగానే టెండర్లు పిలుస్తాం. ఎక్కువగా దెబ్బతిన్న రోడ్లను తొలుత నిర్మిస్తున్నాం. పాక్షికంగా దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్ వర్కులు చేస్తున్నాం.

సిఎం హామీల అమలుకు తీసుకున్న చర్యలు?

ప్రత్తిపాడులో గత జనవరి ఒకటో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ఆర్థిక శాఖ అనుమతి రావాల్సి ఉంది. ప్రత్తిపాడులో డబుల్ లైన్ రహదారులు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. గుంటూరులో శంకర్‌విలాస్ వద్ద బ్రిడ్జి విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ఇంకా డిపిఆర్ తయారు కాలేదు. డిపిఆర్ తరువాత ప్రతిపాదనలు పంపుతాం.

రెండేళ్లలో మరమ్మతులు చేసిన ప్రధాన రహదారులు?

గుంటూరు-చీరాల, సత్తెనపల్లి-అమరావతి, బ్రాహ్మణపల్లి-రేగులగడ్డ, గుంటూరు-అమరావతి, కంతేరు-జాతీయ రహదారి, గుంటూరు-పర్చూరు, బండారుపల్లి-జెకెసి కళాశాల రోడ్డు, నిడమర్రు-కంతేరు, ప్రత్తిపాడు-యడ్లపాడు, పుల్లడిగుంట-పేరేచర్ల, సత్తెనపల్లి-ఫిరంగిపురం, సత్తెనపల్లి-నిడుజర్ల, అచ్చంపేట-నిడుజర్ల, ముప్పాళ్ల-పొనుగుపాడు, బ్రాహ్మణపల్లి-పెదఅగ్రహారం, కురగల్లు-మల్కాపురం, సత్తెనపల్లి-బయ్యవరం, పెదకూరపాడు-శిరిపురం, రావెల-విశదల-మందపాడు, మోతడక-బేజాత్‌పురం, చిలకలూరిపేట-పెదనందిపాడు, ఊటుకూరు-అచ్చంపేట, ఊటుకూరు-క్రోసూరు రహదారులు మరమ్మతులు చేసి రవాణాకు మెరుగుపర్చాం.

గుంటూరు పరిసరాల్లో పెండింగ్‌లో ఉన్న రహదారుల పరిస్థితి?

పలకలూరు-పేరేచర్ల రహదారి నిర్మాణం చేపట్టాం. పలకలూరు వద్ద గుంటూరు కార్పొరేషన్ అధికారులు సైడ్ డ్రెయిన్లు నిర్మించి రహదారి అప్పగించాల్సి ఉంది. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. నందివెలుగు బ్రిడ్జి పనులు చేయాల్సి ఉంది. రైల్వేశాఖ పనులు పూర్తయ్యాయి. మా శాఖ చేపట్టాల్సిన పనులు చేయాల్సి ఉంది. పుష్కరాల సమయంలో చేపట్టిన కొన్ని పనులింకా పూర్తి చేయాల్సి ఉంది. నిధులు రాగానే పూర్తి చేస్తాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి